క్లుప్తంగా

పంట నమోదు తప్పనిసరి



మానవపాడు: ప్రతి రైతు బాధ్యతగా తాను సాగు చేసిన పంట నమోదును వ్యవసాయాధికారుల వద్ద చేసుకోవాలని డీఏఓ సక్రియానాయక్ సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని చెన్నిపాడులో పంట నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నమోదు చేసుకున్న రైతులు ప్రభుత్వం నిర్ణయించిన నిర్ధిష్ట ధరకు పంటను అమ్ముకోవచ్చని తెలిపారు. ప్రతి రైతుకు పంటబీమా వర్తిస్తుందన్నారు.

అదనపు పనిభారం తగ్గించాలి

గద్వాల అర్బన్: వ్యవసాయ విస్తరణ అధికారులపై ప్రభుత్వం మోపుతున్న అదనపు భారాలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూపొందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ అగ్రి మిషన్ పథకం ఏఈఓలపై అదనపు పని భారాలను మోపే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఏఈఓలను చర్చలకు ఆహ్వానించి వారి సమస్యలను పరిష్కరించాలని, ఏఈఓలకు సహాయకులను నియమించాలని కోరారు.

వ్యక్తి రిమాండ్‌కు తరలింపు

శాంతినగర్: పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన శాంతినగర్‌లో చోటుచేసుకుంది. స్థానిక కోయిల్‌దిన్నె రోడ్డులోని ఓ గిర్నిలో రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారనే సమాచారంతో వారం రోజుల క్రితం పోలీసులు దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన నూకలు, బియ్యాన్ని పట్టుకున్నారు. అధిక ధరలకు బియ్యం విక్రయించి సొమ్ము చేసుకోవాలని చూసిన తెలుగు భాస్కర్ అనే వ్యక్తిపై అదే రోజు కేసు నమోదు చేశారు. శుక్రవారం భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని అలంపూర్ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

పిడుగుపాటుతో ఆవు మృతి



ధరూరు: పిడుగుపాటుకు గురై ఓ ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని ఖమ్మంపాడులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బోయ రాముడికి చెందిన ఆవును ఎప్పటిలాగే పొలం వద్ద కట్టేశాడు. గురువారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఆవు పిడుగుపాటుకు గురై మృతి చెందింది. శుక్రవారం ఉదయం రైతు రాముడు పొలం వద్దకు వెళ్లి చూడగా.. ఆవు మృతి చెందినట్లు గమనించిన ఆయన కుటుంబ సభ్యులు విలపించారు. ప్రభుత్వం తరఫున రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



కేటీదొడ్డి: రైతులు మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించొచ్చని జిల్లా ఉద్యానవన అధికారి ఎంఏ అక్బర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏడీహెచ్ నర్సయ్య, ఉద్యానవన శాస్త్రవేత్త భూపేష్, గద్వాల ఉద్యానవన అధికారి రాజశేఖర్, మండల ఏఓ మహాలక్ష్మి, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతిభ



ఎర్రవల్లి: మండల కేంద్రంలోని ఎర్రవల్లి సరస్వతి పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఇర్ఫాన్ అండర్–14 విభాగంలో జిల్లా స్థాయిలో 60 మీటర్లు, 600 మీటర్లు పరుగు పందెంతో పాటు లాంగ్‌జంప్‌లోనూ ఉత్తమ ప్రతిభను కనబర్చాడు. ప్రతిభను కనబర్చిన విద్యార్థిని పాఠశాల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



ఎర్రవల్లిలో..



బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో..



అయిజలో కాళికాదేవి ఆలయంలో..

నేత్రపర్వం.. అమ్మవారి అలంకారం

సాక్షి, నెట్‌వర్క్: దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా శుక్రవారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

■ గద్వాల పట్టణంలో అమ్మవారు ధనలక్ష్మి, మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. నదిగడ్డ ప్రజల ఇలవేల్పు జమ్ములమ్మ ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవిగా, కన్యకాపరమేశ్వరి, మార్కండేయస్వామి అంబాభవానీ, కుమ్మరివీధి, బాలాజీవీధి, పిల్లిగుండ్ల ముడుపు ఆంజనేయస్వామి ఆలయాల్లో అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. స్థానిక కోటలోని చెన్నకేశవస్వామి ఆలయంలో అమ్మవారు అశ్వవాహనంపై ఊరేగారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూ.3.51కోట్ల నగదుతో అమ్మవారిని వైభవంగా అలంకరించారు. రెండో వార్డులోని శ్రీశక్తి స్వరూపిణి తాయమ్మ దేవస్థానంలో రూ.51 లక్షల కరెన్సీతో అమ్మవారిని అలకరించారు.

■ ధరూరు మండల కేంద్రంలోని కాళీకాదేవి ఆలయంలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ నారాయణ కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

■ మల్దకల్ మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో వరలక్ష్మీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో బాదం శ్రీనివాసులు, నాగరాజు, రామకృష్ణ, ఈశ్వరయ్య, నర్సింహయ్య, వెంకటేష్, రాము, రవి, పద్మయ్య, సత్యనారాయణ, గంగాధర్ శెట్టి, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

■ ఉండవెల్లి మండల కేంద్రంతో పాటు కంచుపాడులో అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని అనసూయమ్మ కాలనీలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

■ అయిజ పట్టణంలోని కాలమ్మపేట కాళికాదేవి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీ దేవిగా, గుంతరామలింగేశ్వర స్వామి ఆలయంలో భ్రమరాంబిక దేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో లక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని హంస వాహనంపై ఊరేగించారు.

■ రాజోళిలో అమ్మవారికి గాయత్రీదేవిగా పూజలు నిర్వహించారు. ఎస్‌ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో కుంకుమ, అమ్మవారి జ్ఞాపికలను భక్తులకు అందచేశారు.

■ బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మిగా, ఎర్రవల్లి శివాంజనేయ స్వామి ఆలయంలో గాయత్రీదేవి అలంకరణలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు.



ధరూరులో కాళీకాదేవి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



రాజోళి అమ్మవారి జ్ఞాపికలను అందచేస్తున్న ఎస్‌ఎస్‌కే సమాజ్ సభ్యులు



ఉండవెల్లిలో..



గజలక్ష్మి అలంకరణలో జములమ్మ అమ్మవారు

నిబంధనల మేరకు సర్వే చేయండి



ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మారెడ్డికి సూచనలిస్తున్న ఆర్డీఓ రాంచందర్

అయిజ: డిజిటల్ కార్డులకు సంబంధించిన సర్వే పనులు నిబంధనల మేరకు పూర్తి చేయాలని ఆర్డీఓ రాంచందర్ ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో డిజిటల్ కార్డులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మారెడ్డికి సలహాలు, సూచనలు చేశారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. డిజిటల్ కార్డులను ఇచ్చేందుకు వివరాలను సేకరించే కార్యక్రమం సకాలంలో పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అయిజ మున్సిపాలిటీలోని 3వ వార్డును, కేటీదొడ్డి మండలంలోని మైలోనిగడ్డ గ్రామాన్ని, అలంపూర్ మండలంలోని ర్యాలంపాడు గ్రామాన్ని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రకటించిందన్నారు. అధికారులు వివిధ టీంలుగా ఏర్పడి మూడు ప్రాంతాల్లో శనివారం నాటికి సర్వే పూర్తి చేయాలని సూచించారు

'హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యం'



ప్రమాణం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

శాంతినగర్: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు పద సంచలన్ ర్యాలీ శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ముందుగా భారత్‌మాత, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులకు వందనాలు చేశారు. దేశ రక్షణకు, హిందూ ధర్మం కోసం తాము కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. ప్రతి తల్లి వారి ఇంట్లోని కుమారులను హిందూ ధర్మ రక్షణకు పాటుపడేలా ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణకు పంపాలని కోరారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలందరూ కర్రలు చేతపట్టి క్రమశిక్షణతో ఆలయం నుంచి కోయిల్‌దిన్నె రోడ్డులో కవాతు నిర్వహించారు.

మరమ్మతు ఎప్పుడో ?

- అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు
- ప్రయాణం నరకప్రాయం



కుంటను తలపిస్తున్న వెంకటాపురం, యాపదిన్నె ఆర్‌అండ్‌బీ రోడ్డు

శాంతినగర్: నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు గుంతలమంగా మారి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారాయి. కొత్త రోడ్ల మాట అటుంచితే వేసిన రోడ్లకు మరమ్మతులు సైతం చేపట్టకపోవడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. ఈవిషయమై ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం ప్యాచ్ వర్క్‌లైనా.. చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆయా మండలాల వాహనదారులు కోరుతున్నారు.

పరిస్థితి ఇలా..

నియోజకవర్గంలోని శాంతినగర్ నుంచి అయిజ వరకు వేసిన ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డు గుంతలమయంగా మారింది. కలుకుంట్ల–శాంతినగర్, వెంకటాపురం–అయిజ, వెంకటాపురం స్టేజీ–వేముల రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రయాణానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో తెలంగాణ ప్రయాణికులేగాక కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన వారు సైతం అవస్థలు పడుతున్నారు.

రెన్యువల్ కోటింగ్ వేయాలి

ఎనిమిదేళ్ల క్రితం వేసిన ఆర్‌అండ్‌బీ రోడ్లకు అప్పటి నుంచి వాటి నిర్వహణను పట్టించుకునే నాథుడు కరువయ్యారని నియోజకవర్గ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక, మట్టి టిప్పర్లు, భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. అంతేగాక పైప్‌లైన్లు, కాల్వలు తవ్విన చోట పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.కోట్లలో ఆదాయం ఉన్నా..

రాజోళి మండలంలోని తుంగభద్ర ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక, తనగల గట్టు, పర్దిపురం తిప్ప, వడ్డేపల్లి గట్ల నుంచి మట్టి టిప్పర్ల వల్ల ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం ఉన్నా రోడ్ల గురించి పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. మైనింగ్‌శాఖ ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్ల ఆదాయం వస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదని వాపోతున్నారు.

కుంటను తలపిస్తోంది



వెంకటాపురం స్టేజీ వద్ద యాపదిన్నెకు వెళ్లే రోడ్డు కుంటను తలపిస్తోంది. తారు రోడ్డు అంటే ఎవరూ నమ్మలేని పరిస్థితి వుంది. మొత్తం ఎర్రమట్టి తోలడంతో మట్టిరోడ్డుగా మారింది. వర్షం కురిసిందంటే నీరు నిలుస్తుంది. వావిలాల, సాతర్ల మీదుగా వేముల వరకు రోడ్డు గుంతలమయంగా మారడంతో రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే భయంగా ఉంటుంది. – సోమన్న, యాపదిన్నె, అయిజ మండలం

అయిజకు వెళ్లాలంటే..

వివిధ పనుల నిమిత్తం అయిజ మండల కేంద్రానికి వెళ్లాలంటే భయమేస్తది. వెంకటాపురం, అయిజ మధ్యలో ఉన్న కల్వర్టుల వద్ద మూడు చోట్ల తారురోడ్డు వేయకుండా వదిలేశారు. గుంతలమయమై ఎర్రమట్టి జారుతుంది. మోటార్‌సైకిళ్లపై వెళ్తూ చాలా మంది ప్రమాదాల బారిన పడి చనిపోతున్నారు. డబుల్ రోడ్డు వేసి పదేళ్లయినా కల్వర్టుల వద్ద మాత్రం రోడ్డు వేయడం లేదు. – కుమ్మరి కృష్ణ, కిష్టాపురం, అయిజ మండలం

టెండర్లు పిలిచాం

జిల్లాలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతుల కోసం రూ.2 కోట్లు మంజూరయ్యాయి. వెంకటాపురం స్టేజీ నుంచి వేముల వరకు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. నాలుగు రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తవుతుంది. టెండర్లు ముగిశాక కాంట్రాక్టర్లతో ప్యాచ్ వర్క్‌లు చేయిస్తాం. వెంకటాపురం స్టేజీ వద్ద సీసీ రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు పంపాం. – మహేష్, ఆర్‌అండ్‌బి జేఈ, శాంతినగర్–అయిజ

'పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు'

జోగుళాంబ శక్తిపీఠం: పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పదవులు వరిస్తాయని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం అలంపూర్ జోగుళాంబ ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం అనంతరం ర్యాలీగా పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. అక్కడ ఆలయ కమిటీ చైర్మన్, పాలకమండలి సభ్యులుగా ఎన్నికైన వారికి అభినందన సభ ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ త్వరలోనే స్థానిక ఎన్నికలు కూడా రానున్నాయని, కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన వాడు కావడంతో జిల్లాలో అభివృద్ధి పరుగులు పెడుతుందని తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రులతో..

అలంపూర్: హైదరాబాద్‌లోని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ నివాసానికి ఆతిథ్యం స్వీకరించడానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా విచ్చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తన నివాసంలో మంత్రులను శాలువాలతో సన్మానించారు.



హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న సంపత్‌కుమార్

'ఆత్మహత్యతో సమస్యలు పరిష్కారం కావు'



అవగాహన కల్పిస్తున్న జిల్లా సైకాలజిస్ట్ ప్రదీప్‌కుమార్

మానవపాడు: ఆత్మహత్యతో సమస్యలను పరిష్కరించలేమని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో పోరాడాలని జిల్లా సైకాలజిస్ట్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, శ్రీ గంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశకు ప్రాణం పోసే శక్తి ఉన్నప్పుడు నిరాశకు ప్రాణం తీసే శక్తి ఉంటుందన్నారు. ఈ రోజు అనివార్య కారణాల వల్ల మనకు ఓటమి ఎదురైనా.. ధైర్యం కోల్పోకుండా పోరాడితే రేపటి రోజున అది గెలుపుగా మారుతుందన్నారు. గెలుపుఓటములు సమానమని, కానీ దానిని చూసే వ్యక్తి ఆలోచనలే విభిన్నంగా ఉంటాయని తెలిపారు. ఒక వ్యక్తి ఎప్పుడైతే ఒత్తిడిని జయిస్తాడో అప్పటి నుంచే అనుకూల ఫలితాలు పొందుతాడని పేర్కొన్నారు. ప్రతి నెల మొదటి శుక్రవారం మానవపాడు ఆరోగ్య కేంద్రంలోనూ, ప్రతి రోజు కలవాలంటే జిల్లా ఆరోగ్యకేంద్రంలోని రూం నంబర్ 12 నందు ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సింధు, ఫార్మాసిస్ట్ తిరుమల్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

అయిజ: మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు తాగునీరందిస్తున్న వాటర్ ట్యాంక్‌లు, కుళాయిల పరిరక్షణ గురించి ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న వాటర్‌మెన్‌లకు అధికారులు మూడురోజుల పాటు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. శుక్రవారం శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈసందర్భంగా మిషన్ భగీరథ వాటర్ శాంపిల్ కలెక్టర్ అన్వర్ మాట్లాడుతూ.. చేతి పంపుల్లో తలెత్తుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి వాడాల్సిన పరికరాలు, సింగిల్ ఫేస్, త్రీ ఫేస్ మోటార్ల మరమ్మతుల గురించి వివరించారు. పైప్‌లైన్ లీకేజీ సమస్యలను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వాటర్ ట్యాంక్‌ల్లో బ్లీచింగ్ పౌడర్‌ను ఏవిధంగా కలపాలో సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మైక్రో బైయాలజిస్ట్ నవీన్‌నాయుడు, ఏఈ హర్షత్, వివిధ గ్రామాల వాటర్‌మెన్లు పాల్గొన్నారు.



వాటర్‌మెన్లకు శిక్షణ ఇస్తున్న వాటర్ శాంపిల్ కలెక్టర్ అన్వర్

గొర్రెల యజమానికి జరిమానా

శాంతినగర్: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను గొర్రెలు తినడంతో అవి ఎండిపోయాయని గొర్రెల యజమానికి జరిమానా వేసిన ఘటన వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పైపాడుకు చెందిన కుర్వ మద్దిలేటి గొర్రెలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గడ్డి మేపేందుకు తీసుకొచ్చాడు. ఈ క్రమంలో హరితహారంలో నాటిన మొక్కలను గొర్రెలు మేశాయని యజమాని మద్దిలేటికి రూ.వెయ్యి జరిమానా వేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఇకపై ఎవరైనా మొక్కలకు హానీ కలిగిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



డిగ్రీకళాశాల ఆవరణలో గొర్రెలు

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ మధుబాబు

రాజోళి: గర్భిణులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు అన్నారు. శుక్రవారం రాజోళి పీహెచ్‌సీలో ఆయా గ్రామాల గర్భిణులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యులు ఇచ్చిన ఐరన్, ఫోలిక్ యాసిడ్ మందులను వాడాలని, వాటితో పాటుగా అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం, గుడ్లు, పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. తప్పనిసరిగా ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. నాటు వైద్యం, మంత్రగాళ్ల అంటూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్, రంజిత్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ జిల్లా అధికారి హృదయరాజు

మల్దకల్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయరాజు సూచించారు. శుక్రవారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదువుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకరావాలన్నారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకమని, భవిష్యత్‌ను నిర్దేశిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణ, రమేష్‌లింగం, రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, గోవర్ధన్‌శెట్టి, భాగ్యలక్ష్మి, దేవసేనారెడ్డి, శ్రీనాథ్, తిమ్మోతి, ఇష్తాకర్, కమలహసన్ తదితరులు పాల్గొన్నారు.